నూతన సంవత్సర శుభాకాంక్షలు 2025

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



గుంటూరు రూరల్: ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ 2025 ఏడాది ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపే ప్రత్యేకమైన సంవత్సరంగా మారాలని కోరుకుంటూ ప్రతి ఒక్కరికి పేరుపేరున నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడుగా నారిశెట్టి

చేబ్రోలు: భారతీయ జనతా పార్టీ చేబ్రోలు మండల శాఖ అధ్యక్షుడుగా సుద్దపల్లి గ్రామానికి చెందిన నారిశెట్టి శ్రీరామచంద్రమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా నాయకులు మంగళవారం ప్రకటించారు. చేబ్రోలులోని పార్టీ కార్యాలయంలో జిల్లా క్రియాశీలక ప్రముఖ్ కొత్తూరు వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు.

హ్యాపీ న్యూ ఇయర్

- ఫుల్ జోష్‌తో 2025కు స్వాగతం
- ఆనందోత్సాహాల్లో యువత



బేకరీలో కేకులు కొనుగోలు చేస్తున్న స్థానికులు

పొన్నూరు: 2024 ఏడాది ముగిసింది. పొన్నూరు ప్రజలు ఫుల్ జోష్‌తో 2025 'న్యూ ఇయర్'కు గ్రాండ్ వెల్కమ్ పలికారు. పాత సంవత్సరానికి ఎంత ఘనంగా వీడ్కోలు పలికారో... రెట్టించిన ఉత్సాహంతో బాణసంచా కాలుస్తూ నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. సరిగ్గా రాత్రి 12 గంటలకు కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఒకరికొకరు స్వీట్లను తినిపించుకున్నారు. దీంతో బేకరీలు, స్వీట్ షాపులు, పండ్లు, ఫ్యాన్సీ, రెడిమేడ్ దుకాణాలు, రెస్టారెంట్లు, వైన్ షాపులు, మంగళవారం మధ్యాహ్నం నుంచి కిటకిటలాడాయి. యువత పెద్ద ఎత్తున కేరింతలతో గల్లీల్లో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పోలీసులు ప్రధాన కూడళ్లలో బందోబస్తు నిర్వహించారు.

ముస్తాబైన చర్చిలు, ఆలయాలు...

మరికొన్ని గంటల్లో 2024 సంవత్సరం ముగిసి, నూతన సంవత్సరం–2025 వస్తుండటంతో మంగళవారం సాయంత్రం పొన్నూరు పరిసర ప్రాంతాల్లోని చర్చిలను ముస్తాబు చేశారు. చర్చిలలో రాత్రి పది గంటల నుంచి ప్రార్థనలు నిర్వహిస్తూ నూతన సంవత్సరానికి ఘనమైన ఆహ్వానాన్ని పలికారు.

షిప్ ఫౌండేషన్‌కు సహాయ, సహకారాలు అందిస్తాం

డాక్టర్ షమా సుల్తానా



దుప్పట్లు పంపిణీ చేస్తున్న హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ షమా సుల్తానా

గుంటూరు రూరల్: షిప్ ఫౌండేషన్‌లో ఉన్న హెచ్‌ఐవీ పేషెంట్లకు హోప్ విన్ హాస్పిటల్స్‌లో ఉచిత ఓపీ ద్వారా సేవలు అందిస్తామని హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ షమా సుల్తానా తెలిపారు. మంగళవారం అమరావతిరోడ్డు గోరంట్ల హోసన్న మందిరం సమీపంలోని సొసైటీ ఫర్ వెల్ఫేర్ ఆఫ్ హెచ్‌ఐవి ఇన్ఫెక్టెడ్ పీపుల్ (షిప్) ఫౌండేషన్‌లో ఉన్న 250 మంది హెచ్‌ఐవీ పేషంట్లకు బట్టలు, బెడ్ షీట్స్, భోజనం హోప్ విన్ హాస్పిటల్స్, సలాం నమస్తే గుంటూరు సొసైటీ (ఎన్జీఓ) ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సుమారు 6 వేల మంది పేషెంట్లను అక్కున చేర్చుకున్న షిప్ ఫౌండేషన్ నిర్వాహకులను ఆమె అభినందించారు. హెచ్‌ఐవీ బాధితులకు విశేష సేవలందిస్తున్న షిప్ ఫౌండేషన్ అధ్యక్షురాలు రమాదేవిని డాక్టర్ షమా సుల్తానా మెమెంటో అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) కె.విజయలక్ష్మి, బాజీ బి, శ్రీదేవి పాల్గొన్నారు.

హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవు

పెదకాకాని: నూతన సంవత్సర వేడుకల పేరుతో యువత హద్దు మీరితే చట్టపరమైన చర్యలు తప్పవని పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి అన్నారు. రాత్రి వేళల్లో రహదారులపై కేక్‌లు కత్తిరించడం, మద్యం తాగడం, డీజేలు ధ్వనులు, కేరింతలు కొట్టడం వంటివి నిషేధించడం జరిగిందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కఠిన చర్యలు చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకురాలు నీలిమకు డాక్టరేట్



గుంటూరు రూరల్: ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకురాలు ఎస్.నీలిమ డాక్టరేట్ సాధించినట్లు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో నిర్వహించారు. కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకురాలు ఎస్.నీలిమకు హైదరాబాద్‌కు చెందిన జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. స్కెలిటన్ బేస్డ్ షేప్ రిప్రజెంటేషన్ టెక్నిక్స్ ఫర్ ఆబ్జెక్ట్ రికగ్నైజేషన్ అనే అంశంపై కళాశాలకు చెందిన డాక్టర్ ఎ.శ్రీకృష్ణ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకురాలిని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి ఆర్ గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

పొన్నూరు: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిడుబ్రోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ ఎగ్జిబిషన్, క్విజ్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రదర్శనను ఎంఈఓ శ్రీనివాసరెడ్డి విద్యార్థుల నమూనాలు ఆకట్టుకున్నాయి. విజేతలను ప్రకటించారు. న్యాయ నిర్ణేతలుగా పీబీఎన్ కళాశాల లెక్చరర్లు మాధవి, ఉషారాణి, విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వర్లు వ్యవహరించారు. ప్రథమ బహుమతి సాధించినవారు జిల్లా స్థాయిలో ఈ నెల 3వ తేదీన నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్ ప్రధానోపాధ్యాయులు శేషతల్ప సాయి, హెచ్ఎం. జె. శివలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారాకోడూరులో...

చేబ్రోలు: చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను మండల విద్యాశాఖాధికారి ఆర్.సుబ్బారావు ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌కు మండలంలోని నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు, హెచ్ఎం ఎం ఏడుకొండలు పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి

కాకుమాను: విద్యార్థులు విద్యతోపాటు, సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ-1 కెనడి అన్నారు. కాకుమాను, పెదనందిపాడు మండలాల్లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాకుమాను, పెదనందిపాడు ఎంఈఓ కె.విజయభాస్కర్, ఎం.శ్రీనివాసరావు, పి.జాకబ్, పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

పొన్నూరు: పల్లె పండుగ కార్యక్రమంద్వారా మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ వి.శంకర్ మంగళవారం పరిశీలించారు. ఉప్పరపాలెంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న క్యాటిల్ షెడ్లు, సీసీ రోడ్డు పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా నిరంతరం పనులను పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గుడ్డు సరఫరా చేసే ఏజెన్సీపై చర్యలు

డీఈఓ సి.వి. రేణుక

సాక్షి ఎఫెక్ట్

పొన్నూరు: పొన్నూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు కోడిగుడ్డు సరఫరా సక్రమంగా జరిగే విధంగా చర్యలు చేపడతామని జిల్లా విద్యాశాఖాధికారి సి.వి. రేణుక తెలిపారు. మంగళవారం బడి ముద్దలో గుడ్డు ఉష్ కాకి శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి డీఈఓ స్పందించారు. ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. ప్రస్తుతం పొన్నూరు మండలంలో కోడి గుడ్డు సరఫరా సక్రమంగా లేదని, పంపిణీదారులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏజెన్సీకు షోకాజ్ నోటీసులు జారీచేసి జరిమానా విధిస్తామని ప్రకటనలో పేర్కొన్నారు.

ఎమ్‌బీటీఎస్‌లో సూపరింటెండెంట్ ఉద్యోగ విరమణ



గుంటూరు రూరల్: ఆంధ్ర ప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖలో మూడు దశాబ్దాల పాటు అమూల్యమైన సేవలందించిన పాటూరి భాస్కరరావు మంగళవారం పదవీ విరమణ చేశారు. నల్లపాడులోని ఎంబీటిఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఆయనకు ఘన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజ్ ప్రిన్సిపాల్ టి శేఖర్ మాట్లాడుతూ వివిధ హోదాల్లో సేవలందించారన్నారు. వేడుకలో శాఖాధిపతులు రమేశ్‌కుమార్, రాఘవరావు, రవీంద్ర బాబు, రమణారావు, నాగరత్నేశ్వర పాల్గొన్నారు.

వల్లూరు గ్రామ సర్పంచి రాఘవరెడ్డి మృతి



కాకుమాను(వల్లూరు): వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వల్లూరు గ్రామ సర్పంచి వింతా రాఘవరెడ్డి (55) అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతిచెందారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బుధవారం ఉదయం వల్లూరులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

భూ సమస్యలపై అర్జీలకు సత్వరమే పరిష్కారం

తహసీల్దార్ జియావుల్‌హక్

పొన్నూరు: రెవెన్యూ సంబంధిత సమస్యలపై ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ జియావుల్ హక్ అన్నారు. మంగళవారం మండలంలోని వడ్డిముక్కల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి ఆయన 26 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ సత్యనారాయణ, ఎండోమెంట్ ఏఓ రమేష్, ఆర్‌ఐ శ్రీనివాస్, సబ్ రిజిస్ట్రార్ సిబ్బంది శ్రీకాంత్, వీఆర్‌ఓ మహేష్ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా న్యూఇయర్ వేడుకలు

ఇన్‌డోర్ అనుమతులతో అవుట్‌డోర్‌లో..



గుంటూరు రూరల్: అధికార పార్టీకి చెందిన వాడివి ఐతే నువ్ ఏంచేసినా ఓకే. ఏవిధమైన పార్టీ చేసినా ఓకే.ఇలా జరుగుతుంది నేటి పరిస్థితి... మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఇన్నర్‌రింగ్‌రోడ్డులో ఒక కళ్యాణ మండపంలో ఇన్‌డోర్ పర్మిషన్ తీసుకుని ఇతర వేడుకల పేరుతో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. వీరి వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు రావటంతో ట్రాఫిక్ నియంత్రణకు శ్రమిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు, ఎక్సైజ్ అధికారులు, పోలీసులు ఉండటమే కారమణం అని ప్రజలు విమర్శిస్తున్నారు. ఏది ఏమైనా అనుమతులు ఉన్నంతవరకూ మాత్రమే వేడుకలు చేసుకోవాలి... కానీ అధికారం ఉంది కదా అని ఇష్ట వచ్చినట్లు చేస్తు ఉంటే ప్రభుత్వం పట్టించుకోదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు అందరూ అదే పార్టీలో ఉన్నారని స్థానిక పోలీసులే చెప్పటం విశేషం.

కుల గణన జాబితాల సవరణ గడువు పొడిగింపు

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కుల గణన జాబితా సవరణకు జనవరి 7వ తేదీ వరకు పొడిగించినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో పూర్తయిన కుల గణన జాబితాలను ఈ నెల 26న నగరంలోని 206 వార్డు సచివాలయాలలో నోటీసు బోర్డుల్లో సందర్శనార్థం ప్రకటించడం జరిగిందన్నారు.